ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 7 ఏప్రిల్ 2024



ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం
రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి
8లో..

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:28 ఆదివారం
సహర్ 4:35 సోమవారం

పదేళ్లుగా పదోన్నతుల్లేవ్!



- జోన్-1 పరిధిలో ప్రమోషన్‌కు నోచుకోని ఎస్సైలు
- కొత్త జోనళ్లతో పాత జోన్-5 పరిధిలోని వారికి అన్యాయం
- సీనియారిటీలో వెనుకబడిన 109 మంది..

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పదకొండేళ్లుగా వారు పదోన్నతులకు నోచుకోవడం లేదు. మూడేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వారికి అశనిపాతంగా మారింది. కొత్త జోనళ్ల ఏర్పాటుతో పాత జోన్ పరిధిలోని వారికి తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఒకే బ్యాచ్‌కు చెందిన తమలోని కొందరికి సీఐలుగా పదోన్నతులుగా రాగా, మూడేళ్లుగా వారి కింద పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా తమకు పదోన్నతులు కల్పించాలని 2012 బ్యాచ్ ఎస్సైలు కోరుతున్నారు.

● ఆరేళ్లలోపే పదోన్నతులు కల్పించాలి..

పాత జోన్-5 పరిధిలో ఎంపికైన పలువురికి సీఐలుగా పదోన్నతులు రాక పదకొండేళ్లుగా ఎస్సైలుగానే విధులు నిర్వహిస్తున్నారు. మూడేళ్ల క్రితం గత ప్రభుత్వ హయాంలో తీసుకవచ్చిన కొత్త జోనళ్ల కారణంగా పాత హైదరాబాద్ జోన్ పరిధిలోకి వచ్చే ఎస్సైలు కొత్తగా ఏర్పాటు చేసిన జోన్-2 బాసర, జోన్-3 రాజన్న జోన్ పరిధిలోకి వచ్చారు. సీఐల పదోన్నతులను మల్టీ జోనల్ ప్రకారం సీనియారిటీ జాబితాలను రూపొందించి ఇవ్వాల్సి ఉంటుంది. పోలీస్ శాఖ మల్టీ జోన్ పరిధిలోకి కాళేశ్వరం, బాసర, రాజన్న, భద్రాద్రి జోన్లు వచ్చాయి. దీంతో పాత జోన్ పరిధిలో ఉన్న ఎస్సైలు సీనియారిటీలో వెనుబడడంతో తీరని అన్యాయం జరిగింది. ఫలితంగా పదోన్నతులు పొందలేకపోయారు. ఒకే బ్యాచ్‌కు చెందిన ఎస్సైలలో కొందరు సీఐలుగా పని చేస్తూ ఉంటే, వారి కింద ఎస్సైలుగా పని చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2011-12లో జోన్-5(ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్)లో నిర్వహించిన డైరెక్టు ఎస్సైల నియామకాల్లో 142 మంది ఎంపికై విధులు నిర్వహిస్తున్నారు. సాధారణంగా ఎస్సైలకు 6 ఏళ్లలోపే పదోన్నతులు కల్పించాలనే నిబంధనలు ఉన్నాయి. కానీ గత ప్రభుత్వాలు పట్టించుకోని కారణంగా కొందరు పదోన్నతులకు నోచుకోక ఇంకా ఎస్సైలుగానే విధులు నిర్వహిస్తున్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సైలకు 2021లో పదోన్నతులు కల్పించేందుకు చర్యలు చేపట్టింది. మొదట లేఖ నంబర్. 44/ఇ/2021 ద్వారా 2021 జూలై 7న ముగ్గురికి, ఆ తర్వాత లేఖ నంబర్. ఇ1/374/2021, లేఖ నంబర్ 410/2021 ద్వారా 2021 జూలై 31వ తేదీన 42 మందికి పదోన్నతి కల్పించింది. దీంతో 142 మందిలో 45 మంది పోను 97 మంది మిగిలిపోయారు.

రెండు జోన్లను ఏడు జోన్లుగా..

ఇదే సమయంలో ప్రభుత్వం గతంలో ఉన్న రెండు జోన్లను ఏడు జోన్లుగా విభజించింది. సీఐల పదోన్నతులకు సంబంధించి మల్టీ జోన్-1 పరిధిలోని కాళేశ్వరం, బాసర, రాజన్న, భద్రాద్రి జోన్లలో ఉండే ఎస్సైల సీనియారిటీ జాబితాను రూపొందిస్తారు. పాత హైదరాబాద్ జోన్ పరిధిలోని జిల్లాలకు చెందిన 66 మంది ఎస్సైలు కొత్తగా ఏర్పాటు చేసిన జోన్-2 బాసర, జోన్-3 రాజన్నలోకి జీవో 317 ద్వారా వచ్చారు. వారి రాకతో సీనియారిటీ జాబితాలు తారుమారయ్యాయి. పాత జోన్ పరిధిలో ఉన్న 97 మంది సీనియారిటీ జాబితా మొత్తం మారిపోయింది. ఆ తర్వాత కొత్త మల్టీ జోన్ ప్రకారం 2023 మే 4వ తేదీన సీనియారిటీ జాబితాలను తయారుచేశారు. అదే ఏడాది జూన్ 16వ తేదీన 30 మందికి, జూలై 21వ తేదీన 24మందికి సీఐలుగా పదోన్నతులు కల్పించారు. కొత్త జోన్ల అనంతరం పాత జోన్ పరిధిలో నుంచి వచ్చిన 66 మందిలో 48 మంది పాత జోన్ పరిధిలోని వారికంటే సీనియారిటీ జాబితాలో ముందు ఉండడంతో వారికి సీఐలుగా పదోన్నతి లభించింది. పాత జోన్ ప్రకారం పదోన్నతులు కల్పించి ఉంటే 97 మందిలో 66 మందికి పదోన్నతి వచ్చేదని, ఇంకా 31 మంది మాత్రమే మిగిలి ఉండే వారని, తమ జాబితాలో కేవలం ఆరుగురికి మాత్రమే పదోన్నతి వచ్చిందని ఎస్సైలు పేర్కొంటున్నారు. జోనళ్లను మార్చడం వల్ల మల్టీ జోన్-1లో పాత హైదరాబాద్ జోన్ పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సిద్ధిపేటలకు చెందిన ఎస్సైలు చేరడంతో తమకు అన్యాయం జరిగిందని పాత జోన్-5 పరిధిలోని ఎస్ఐలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత సుదీర్ఘ కాలం పదోన్నతులు లేకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎప్పుడూ లేదని అంటున్నారు. ఒకే బ్యాచ్‌కు చెందిన తమలోని కొందరికి సీఐలుగా పదోన్నతులుగా రాగా, మూడేళ్లుగా వారి కింద పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది.. కొత్త జోనళ్ల వల్ల సీనియారిటీలో వెనుకబడ్డ రిమార్కులు లేని తమకు సీఐలుగా పదోన్నతి కల్పించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లాలని ఇటీవల మంత్రులు సీతక్క, కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్‌లను ఎస్సైలు కలిసి విన్నవించారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమకు సీఐలుగా పదోన్నతులు కల్పించాలని 2012 బ్యాచ్ ఎస్సైలు కోరుతున్నారు.

పోలింగ్‌కు ముందు మాక్ పోలింగ్ నిర్వహించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ రోజున పోలింగ్ సమయానికి ముందు ఏజెంట్ల సమక్షంలో తప్పనిసరిగా మాక్ పోలింగ్ నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధి పోలింగ్ అధికారులకు ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని 1050 మంది పోలింగ్ అధికారులకు ఏప్రిల్ 2, 4, 6 తేదీల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 13న జరిగే పోలింగ్‌కు సంబంధించిన హ్యాండ్ బుక్‌ను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రెండు, మూడుసార్లు చదవాలని సూచించారు. పోలింగ్ అధికారులు ఉదయం మాక్ పోలింగ్ నిర్వహించాలని, పోలింగ్ ఏజెంట్లు రానిపక్షంలో 15నిమిషాలు వేచి చూసి తర్వాత మాక్ పోలింగ్ నిర్వహించాలని, మాక్‌పోలింగ్ ముగిసిన తర్వాత వీవీప్యాట్ లో స్లిప్పులను తొలగించాలని తెలిపారు. మాక్ పోలింగ్ ముగిసిన తర్వాత తప్పనిసరిగా సీఆర్‌సీ చేయాలని, మర్చిపోతే కౌంటింగ్ సమయంలో ఇబ్బందులు ఎదుర వుతాయన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో బి గంగయ్య, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంఈవో సురేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి

- మంథని ఆర్డీవో హనుమానాయక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో హనుమా నాయక్

రామగిరి, ఏప్రిల్ 6: ఎన్నికల నిబంధనలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని మంథని ఆర్డీవో హనుమానాయక్ సూచించారు. శనివారం జేఎన్టీయూ(మంథని) ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మే 13న జరిగే పోలింగ్ రోజు నిబంధనల పాటిస్తూ విజయవంతం కోసం ఎన్నికల మార్గదర్శకాల పాటించాలని సూచించారు. గతంలో పోలింగ్ నిర్వహించిన అవగాహన ఉన్నప్పటికి ప్రతి ఎన్నికలు కొత్త నిబంధనలు ఉంటాయని పేర్కొన్నారు. పోలింగ్ రోజు ఉదయం అధికారులు మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ వివరాలను ప్రతి గంట, గంటకు సెక్టార్ అధికారులకు తెలపాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో తహసీల్దార్లు ఎండి ఆరీఫోద్దీన్, నాగరాజు, రాంచందర్‌రావు, రాజయ్య, మాస్టర్ ట్రైనర్లు పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్

పెద్దపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా పర్యవేక్షణకు కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని డీపీవో ఆశాలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవిలో జిల్లాలో తాగునీటి సరఫరా పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అంశాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని, తాగునీటి సరఫరా సమస్యలున్న గ్రామీణ ప్రాంత ప్రజలు సెల్‌ఫోన్ నంబర్ 9000963292కు ఫోన్‌చేసి సమస్య తెలియజేయాలని, సదరు సమస్యను వెంటనే క్షేత్రస్థాయిలో పరిష్కరించి నీటి సరఫరా పునరుద్ధరణ అయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బీజేపీ అధికారంలో ఉంటేనే దేశానికి రక్షణ

- పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోమాసే శ్రీనివాస్

పెద్దపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే దేశానికి రక్షణగా ఉంటుందని బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ అన్నారు. శనివారం పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి బీజేపీలో ఎలాంటి గ్రూపు తగాదాలు లేవని, తమదంతా ఒకటే మోదీ వర్గం అని అన్నారు. మూడోసారి నరేంద్ర మోదీని ప్రధానమంత్రిగా చేసేందుకు ప్రతి ఒక్కరు కష్టపడాలని అన్నారు. వివేక్ వెంకటస్వామి కుటుంబంలో ముగ్గురికి టికెట్లు ఇవ్వడం కాంగ్రెస్‌లో కుటుంబ పాలనకు తెరలేపిందని విమర్శించారు. వివేక్ ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో వ్యాపారాలు పెట్టి ఆర్థికంగా ఎదుగుతున్నారని, ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వాళ్లు ఇక్కడ ఎలాంటి పరిశ్రమలను నెలకొల్పకుండా యువతకు తీరని అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పెద్దపల్లి పార్లమెంట్ ప్రాంతాన్ని వివేక్ ఒక రాజరిక వ్యవస్థగా మార్చుకున్నారని విమర్శించారు. ఇక్కడి ప్రజలను మోసం చేసి ఆస్తులను కూడబెట్టుకుంటున్నారని, చెన్నూర్ నియోజకవర్గంలో పంటలు నష్టపోయిన రైతుల గురించి వివేక్ పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఒక డెంగ్యూలాగా వివేక్ కుటుంబం ఈ ప్రాంతానికి శాపంగా మారిందన్నారు. రాజకీయ దోపిడీకి పాల్పడుతున్న వివేక్ కుటుంబాన్ని తరిమి కొట్టాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీ కృష్ణకు దళితులు, రైతుల పట్ల అవగాహన లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసింది లేదన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంటేనే దేశానికి రక్షణ అని అన్నారు. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి ఈ ప్రాంత రైతులకు కన్నీళ్లు మిగిల్చారన్నారు. ఉమ్మడి కరీం నగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్ రావు, పార్టీ నాయకులు ఠాగూర్ రాంసిం గ్, ఆది కేశవరావు, పిన్నింటి రాజు, కొంతం శ్రీనివాసరెడ్డి, ఎండ్యాల కుమార్, వెల్లంప ల్లి శ్రీనివాసరావు, పర్స సమ్మయ్య, పల్లె సదానందం, జంగ చక్రధర్ రెడ్డి, అక్కెపల్లి క్రాంతి, పెండ్యాల రమేష్, కరుణాకర్, తుడి రవీందర్, రమేష్, మనోహర్, రవీందర్, రమేష్, తూముల మల్లారెడ్డి, మంతెన కృష్ణ, నారాయణస్వామి, జగన్, ఎల్లంకి రాజేందర్, సంపత్, శ్రీనివాసమూర్తి, ఆనంద్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 6: ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ తగలకుండా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.ప్రమోద్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండలో బయట తిరగవద్దని, అత్యవసర పరిస్థితి అయితేగానీ ప్రజలు బయటికి రాకూడదని, ఉదయం 11 గంటల నుంచి 4గంటల మధ్యలో ఎట్టి పరిస్థితులలో ఇళ్ల నుంచి బయటకు రావద్దని పేర్కొన్నారు. ఆశా, ఏఎన్ఎంల వద్ద, అంగన్‌వాడీల్లో ఓఆర్ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచామని. పీహెచ్‌సీలలో ఓఆర్ఎస్ ద్రావణం, ఐవీ ఫ్లూయిడ్స్ అందుబాటులో ఉంచామన్నారు. ఎండలో పనిచేసే కార్మికులు నీటితోపాటు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుంచి శరీరాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. అధిక చెమట, దాహం, బలహీనత, తల తిప్పడం, కండరాలు పట్టేయడం వంటి లక్షణాలు ఉంటే వడదెబ్బగా భావించి సమీప ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లడం లేదా 108కు ఫోన్ చేయాలని కోరారు. అదే విధంగా వీరికి సహాయం అందేవరకు చల్లని ప్రదేశానికి తరలించాలని, చల్లని నీటితో శరీరాన్ని తుడవాలని, వీలైనంత గాలి తగిలే విధంగా జాగ్రత్త వహించాలని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి

- ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి బాబర్

జ్యోతినగర్, ఏప్రిల్ 6 : పెద్దపల్లి పార్లమెంటు స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపునకు ఐఎన్‌టీయూసీ శ్రేణులు కృషి చేస్తారని యూనియన్ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా తెలిపారు. శనివారం ఎన్టీపీసీలోని మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో బాబర్ మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి ఐఎన్‌టీయూసీ దాని అనుబంధ సంఘాలు పని చేస్తాయని పిలుపునిచ్చారు. పెద్దల్లి పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి గతంలో కాక జి.వెంకటస్వామి, వివేక్‌లు ఎంతో శ్రమించారని గుర్తు చేశారు. రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరణకు కాక, వివేక్ కృషి చేశారన్నారు. వంశీని ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో ఎన్టీపీసీ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరెపల్లి రాజేశ్వర్, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేముల కృష్ణయ్య, నాయకులు రమేష్, జీవీ.రావు, వెంకటయ్య, భానేశ్వర్‌రావు, రాజయ్య, భూమల్ల చందర్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టాస్క్ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్



టాస్క్ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోగల టాస్క్ కేంద్రాన్ని శనివారం సందర్శించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, భవనానికి కార్పొరేట్ లుక్ వచ్చేలా తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతూ భవనంలో శాస్త్రవేత్తలు, ఔత్సాహిక వేత్తలకు సంబంధించిన స్ఫూర్తిదాయకమైన పేయింటింగ్స్ వేయించాలని సూచించారు. కిటికిల వద్ద గ్లాసెస్, ఏసీ, ఫ్యాన్‌లు, లైట్‌లు, దోమల మెష్ ఏర్పాటు చేయాలన్నారు. టాస్క్ భవనం ప్రాంగణం చుట్టూ కాంపౌండ్‌వాల్ నిర్మించాలన్నారు. కాంపౌండ్ లోపల గార్డెనింగ్, టాయిలెట్‌లు ఏర్పాట్లు చేయాలని, బయట ఉడెన్ టేబుల్స్ ఏర్పాటు చేయాలని, అవి శిక్షణా తరగతుల నిర్వహణకు ఉపయోగపడే విధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 16 రీడింగ్ రూమ్‌ల నుంచి విద్యార్థులను టాస్క్ కేంద్రానికి అనుసంధానించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని, ప్రతి రీడింగ్ రూమ్ నుంచి కనీసం 20మంది విద్యార్థులను గుర్తించి వారికి టాస్క్ ద్వారా బ్యాచ్‌ల వారీగా అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తామని అన్నారు. అనంతరం మండల సమాఖ్య భవనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఫైలింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఉమ్మడి జిల్లా టాస్క్ మేనేజర్ గంగాప్రసాద్, ఐటిఐ ప్రిన్సిపాల్ నరసింహాచారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్షలు



పెద్దపల్లిలో దీక్ష చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మంథనిలో మాట్లాడుతున్న పుట్ట మధూకర్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 6: బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో శనివారం రైతు నిరసన దీక్షలు చేపట్టారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం చేపట్టిన రైతు దీక్ష శిబిరంలో దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రైతుల ధాన్యానికి క్వింటాలుకు ఐదు వందల రూపాయలు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ. 2లక్షల రైతు రుణమాఫీ తక్షణమే చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలతో పాటు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేకుంటే బీఆర్ఎస్ పక్షాన పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రఘువీర్‌సింగ్, ఎంపీపీలు బండారి స్రవంతి శ్రీనివాస్, నూనెటి సంపత్, జడ్పీటీసీ గంట రాములు, మండల పార్టీ అధ్యక్షులు ఐరెడ్డి వెంకట్ రెడ్డి, పురం ప్రేమ్ చందర్ రావు, పట్టణాధ్యక్షులు ఉప్పు రాజ్ కుమార్, జూలపల్లి విండో చైర్మెన్ సందీప్ రావు, దాసరి ఉష, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను ముంచాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

మంథని, ఏప్రిల్ 6: రైతులను ముంచాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు మండిపడ్డారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు పుట్ట మధు శనివారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, ప్రజల సమస్యలను గాలికి వదిలేసి అందరిని మోసం చేశారన్నారు. రైతుల, ప్రజల కష్టాలను సైతం పట్టించుకోకుండా సీఎం ఐపీఎల్ మ్యాచ్‌లు, గోలీల ఆటలు అంటూ తిరుగడం విచారకరమన్నారు. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్, సరిపడా సాగు నీరు అందించారన్నారు. ఏడాదికి రెండు పంటలకు పెట్టుబడిగా రైతుబంధు అందించారన్నారు. వ్యవసాయమంటేనే జంకే పరిస్థితుల్లో ఉన్న రైతులకు కేసీఆర్ వ్యవసాయ రంగంలో చేపట్టిన విప్లవాత్మక మార్పులు వ్యవసాయాన్ని ఓ పండుగలా మార్చాయన్నారు. రైతులకు మళ్లీ పాత కష్టాలు మొదలయ్యాయన్నారు. పంటలు ఎండి నష్ట పోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల పరిహారం చెల్లించాలని, సాగునీటి వెంటనే విడుదల చేయాలని, రైతు బంధు రైతులందరికీ వేయాలన్నారు. జడ్పీటీసీ తగరం సుమలత, నేతలు ఏగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, పూదరి సత్యనారాయణగౌడ్, కాయితీ సమ్మయ్య, గరెపల్లి సత్య నారాయణ, కనవేన శ్రీనివాస్, పెగడ శ్రీనివాస్, బెల్లం కొండ ప్రకాశ్ రెడ్డి, వెల్పుల గట్టయ్యలతో పాల్గొన్నారు.



గోదావరిఖనిలో దీక్ష చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ పాలనలో అరిగోస పడుతున్నరైతాంగం

గోదావరిఖని, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పాలనలో రైతాంగం దిక్కుతోచని స్థితిలో అరిగోస పడుతుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. శనివారం ప్రధాన చౌరస్తాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన రైతు నిరసన దీక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రైతు కంటినిండా నిద్రపోయేవాడని, పదేళ్ల కాలంలో రాష్ట్ర రైతాంగానికి ఎటువంటి కష్టాలు ఇబ్బందులు లేకుండా కేసీఆర్ సంక్షేమ పాలన కొనసాగించారన్నారు. కానీ కాంగ్రెస్ పాలనలో ఎక్కడ చూసినా ఎండిన పంట పొలాలు, ఇంకిన బోరుబావులతో రైతాంగం దిగ్గతోచని స్థితిలో ఉందని చందర్ ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు రూ.25వేల పరిహారం అందజేయాలని, ప్రకటించిన రూ.500 బోనస్‌ను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పిటి స్వామి, కౌశిక హరి, గోపు ఐలయ్య యాదవ్, నడిపెల్లి మురళీధర్ రావు, కార్పొరేటర్లు పెంట రాజేష్, కన్నూరి సతీష్ కుమార్, కుమ్మరి శ్రీనివాస్, ముదాం శ్రీనివాస్, కల్వచర్ల కృష్ణవేణి, జనగామ కవిత సరోజిని, జంగంపల్లి సరోజన, అయిత శివకుమార్, ఎన్వి రమణరెడ్డి, బాదే అంజలి, అంతర్గం జడ్పీటీసీ ఆముల నారాయణ, మట్ట లక్ష్మి, నాయకులు మాదాసు రామమూర్తి, పర్లపల్లి రవి, పిల్లి రమేష్, జేవిరాజు, మెతుకు దేవరాజ్, నారాయణదాసు మారుతి, చల్లగురుగుల మొగిలి, కాల్వ శ్రీనివాస్, జక్కుల తిరుపతి, బొడ్డుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కథలాపూర్, ఏప్రిల్ 6: మండల కేంద్రంలో శనివారం సాయంత్రం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. శివారులోని ఓ కొట్టంలో పేకాట ఆడుతున్నట్టు ఎస్సై నవీన్‌కు సమాచారం రావడంతో సిబ్బందితో అక్కడికి వెళ్లి పట్టుకున్నారు. ఐదుగురి నుంచి రు. 7,200లు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రాయికల్, ఏప్రిల్ 6: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన నాగుల సతీష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈ నెల 2వ తేదీన నాగుల సతీష్‌కు చెందిన గొర్రెలు పుట్ట గంగాధర్‌కు చెందిన వరి పొలంలో మేశాయి. ఈ విషయంలో 3వ తేదీన పెద్ద మనుషుల సమక్షంలో పిలిపించి మాట్లాడుతుండగా సతీష్ కులం పేరుతో దూషించి చెప్పుతో కొట్టి అవమానించాడని గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సైబరాబాద్‌లో బాలిక కిడ్నాప్

- జగిత్యాలలో సంచారం, నలుగురిపై కేసు నమోదు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 6 :హైదారాబాద్ పట్టణంలోని సైబరాబాద్‌కు చెందిన ఓ బాలిక కిడ్నాప్‌నకు గురైనట్లు తెలిసింది. అయితే కిడ్నాప్‌నకు గురైన బాలిక కొన్ని రోజులుగా జగిత్యాల జిల్లా కేంద్రంలో సంచరిస్తున్నట్లు జగిత్యాల పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు జగిత్యాలతో పాటు మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన నలుగురు యువకులు బాలికను కిడ్నాప్ చేసినట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి హార్వెస్టర్ దగ్ధం



భూషణరావుపేటలో దగ్ధమైన హార్వెస్టర్

కథలాపూర్, ఏప్రిల్ 6 : మండలంలోని భూషణరావుపేటలో శనివారం ఉదయం విద్యుత్ తీగలు తగిలి రాగుల రవి అనే యజమాని హార్వెస్టర్ పూర్తిగా దగ్ధమైంది. గన్రెడ్డి కుంట శివారులో ఓ రైతుకు చెందిన వరి పొలం కోస్తుండగా పైభాగంలో ఉన్న ఎల్‌టీ విద్యుత్ తీగలు తగిలాయి. వైర్ల నుంచి నిప్పురవ్వలు ఇంజిన్‌పై పడడంతో మంటలు చెలరేగాయి. వరి పొలంలోనే మంటలు వ్యాపించడంతో భయాందోళనకు గురైన రైతులు ఫైర్ ఇంజిన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. వ్యవసాయానికి సంబంధించిన వైర్లను చూసు కుని హార్వెస్టర్ యజమానులు వరి కోతల పనులు చేపట్టాలని విద్యుత్ అధికారులు సూచించారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేయడానికి అవకాశం ఉంటుం దన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై నవీన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ సర్పంచ్ గడ్డం స్వామిరెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు పరిశీలించారు.

హైటెన్షన్ విద్యుత్ వైర్లు తాకి యువకుడి మృతి

సుల్తానాబాద్, ఏప్రిల్ 6: సుల్తానాబాద్ మండలంలోని మియాపూర్‌లో శనివారం ఓ వ్యాన్ రివర్స్ వస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు వ్యాన్‌కు తగిలి దానిని అనుకుని ఉన్న దొడ్ల గంగాదర్ అనే యువకుడు మృతి చెందాడు. మియాపూర్ గ్రామానికి చెందిన ఒక రైతు తన పొలంలో షెడ్డు నిర్మించుకుంటున్న సందర్భంలో దానికి అవసరమైన సిమెంట్ బ్రిక్స్‌ను గోదావరిఖని నుంచి వ్యాన్‌లో తెచ్చారు. వ్యాన్ పొలంలో దిగబడి పోవ డంతో వేరే ట్రాక్టర్ తెచ్చి ఇటుకలను ఇదే గ్రామానికి చెందిన హమాలీ పని చేసే దొడ్ల గంగాదర్(27) పనిస్థలానికి తరలించారు. తిరిగి వ్యాన్ రివర్స్ వెళుతుండగా గంగాధార్ దాన్ని తాకుతూ నిలుచున్నాడు. పైన ఉన్న 11 కేవీ హైటెన్షన్ వైర్లు వ్యాన్‌పై భాగంలో తాకి షాక్ రావడంతో గంగాధర్ అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- ఈసీఈ హెచ్‌వోడీ ప్రభాకర్



మాట్లాడుతున్న హెచ్‌వోడీ ప్రభాకర్

కొడిమ్యాల, ఏప్రిల్ 6: ఇంజనీరింగ్ విద్యార్థులు విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలని ఈసీఈ హెచ్‌వోడీ ప్రభాకర్ కోరారు. శనివారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో ఈ నెల 1న ప్రారంభమైన డీజీటల్ డీజైన్ అండ్ వెరీ లాగ్ ముగిసింది. ముగింపు సమావేశంలో ఈసీఈ హెచ్‌వోడీ మాట్లాడుతూ వర్క్ షాప్‌లో విద్యార్థులు వివిధ విభాగాల్లో డీజైన్ ఎనాలసీస్ వెరిఫికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ వెరీ లాగ్‌లో కోడింగ్ స్కిల్స్ ఏవిధంగా తర్ఫీదు అవ్వాలో నేర్పించామన్నారు. ప్రతి విద్యార్థి సమయాన్ని వృధా చేయకుండ కష్టపడి చదువుకొని లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరారు. ఈ వర్క్ షాప్‌నకు రిసోర్స్ పర్సన్‌గా వచ్చిన డా.. సనత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో జ్ఞానాన్ని సంపాదించుకుంటూ అకుంఠిత దీక్షతో ముందుకు సాగాలన్నారు. బారత దేశ భవిష్యత్తు యువత మీద ఆధారపడి ఉందన్నారు. ఈ ముగింపు సమావేశంలో కో కన్వీనర్ ప్రవీణ్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీనివాస్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌ను బెదిరించిన ఇద్దరిపై కేసు

కోల్‌సిటీ, ఏప్రిల్ 6: విలేకరులమని తమకు రూ.10వేలు ఇవ్వాలంటూ రేషన్ డీలర్‌ను బెది రించిన ఇద్దరు వ్యక్తులపై శనివారం కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. తిలక్‌నగర్, ఫైవింక్లయిన్‌లో రేషన్ షాపు నిర్వహించే అవినాష్‌ను సురేష్, శివ అనే ఇద్దరు తాము విలేకరులమని, రూ.10వేలు ఇవ్వాలంటూ బెదిరించినట్టు పోలీసులు తెలిపారు. బాధితుడిఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఎండిన పంటలకు నష్ట పరిహారం అందజేయాలి



ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గంగాధర, ఏప్రిల్ 6: ప్రభుత్వం ఎండిన పంటలకు నష్ట పరిహారం అందజేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో మధురానగర్‌లో ఎండిపోయిన వరి పంటను పరిశీలించారు. ఈసందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేమేడిపల్లి సత్యం ఎక్కడ పొలాలు ఎండిపోలేదని చెప్పడం సరి కాదన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, రేండ్ల శ్రీనివాస్, నారాయ ణ ,రాజశేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల


గణేశ్‌నగర్, ఏప్రిల్ 6: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎల్ఎల్‌బీ ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీశ్రీరంగప్రసాద్ తెలిపారు. పరీక్షల ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

మృత్యు శకటం

- విద్యార్థులను బలితీసుకున్న అతివేగం
- బోల్తా పడిన మొరం టిప్పర్
- మట్టిలో కూరుకుపోయి ముగ్గురు దుర్మరణం
- అన్నాచెల్లెళ్లు, సమీప బంధువు మృతి
- బోర్నపల్లిలో విషాదం



విజయ్, వర్ష, సింధుజా మృతదేహాలు



బోల్తా పడిన టిప్పర్

హుజూరాబాద్, ఏప్రిల్ 6: పెద్దమ్మతల్లికి మొక్కులు చెల్లించుకొని తిరుగు ప్రయాణం అవు తున్న వారిని విధి వెంటాడింది. మొరం టిప్పర్ రూపంలో ముగ్గురు చదువుకునే విద్యార్థులను మృత్యువు కబళించింది. మోటర్ సైకిల్‌పై ముగ్గురు ఇంటికి వస్తున్న క్రమంలో మొరం టిప్పర్ బోల్తా పడడంతో అదే మట్టిలోనే కురుకుపోయి అక్కడికక్కడే మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెళ్లు, సమీప బంధువు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఈ హృదయ విదారక సంఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే హుజూరాబాద్ మున్సి పాలిటీ పరిధిలోని బోర్నపల్లిలో పెద్దమ్మతల్లి బోనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గంట విజయ్ (17), గంట వర్ష (15), గంట సింధుజా (18) హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. నిద్ర వస్తుందని తల్లిదండ్రులకు తెలిపారు. ముగ్గురు కలిసి మోటర్ సైకిల్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో ఎలబోతారం నుంచి ఎదురుగా వస్తున్న మట్టి టిప్పర్ గమనించారు. మూల మలుపు ఉండడంతో విజయ్ మోటర్ సైకిల్‌ను నిలిపివేశాడు. అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన టిప్పర్ డ్రైవర్ వారిని ఆకస్మాత్తుగా గుర్తించి సడన్ బ్రేక్ వేయడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో బైక్‌పై ఉన్న ఉన్న ముగ్గురు మట్టిలో కురుకుపోయి శ్వాస అందకపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు ఎక్స్‌కావేటర్ సహాయంతో మృతదేహాలను వెలికి తీసి హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన అన్నాచెల్లెళ్లు విజయ్, వర్ష, బంధువు సింధుజా మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో పాటు, స్థాని కులు కంట తడి పెట్టారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుము క న్నాయి. గంట విజయ్ ఇంటర్, వర్ష పదో తరగతి, సింధుజా డిగ్రీ చదు వుతున్నారు. హుజూరాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● అతివేగంతో ఇబ్బందులు..

నేషనల్ హైవే పనులు జరుగుతుండడంతో టిప్పర్ డ్రైవర్లు అతివేగంగా వాహనాలు నడుపుతున్నారు. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 500 టిప్పర్లతో సైదాపూర్, హుజూరాబాద్ మండలాల్లోని గుట్టల్లో నుంచి మట్టిని తరలిస్తున్నారు. అనుభవం లేని యువ డ్రైవర్లతో టిప్పర్లు నడుపుతుం డడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో కూడా టిప్పర్ డ్రైవర్లు కార్లు, మోటర్ సైకిళ్లను ఢీ కొట్టిన సందర్భాలు ఉన్నాయి. బోర్నపల్లిలో జరిగిన సంఘటనతో పోలీసులు కళ్లు తెరిచి డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

● మృతుల కుటుంబాలకు పరామర్శ..

బోర్నపల్లిలో ముగ్గురు మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి చేరుకొని మృతుల కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ మృతుల కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి సంతాపం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అక్రమ వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడులు

- రూ.16.13లక్షల నగదు, 359డాక్యుమెంట్లు స్వాధీనం

- జిల్లా వ్యాప్తంగా 14కేసులు నమోదు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 6: జిల్లావ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ, ఫైనాన్స్‌లు నిర్వహిస్తున్న వ్యాపారుల ఇళ్లపై శనివారం 24పోలీసు బృందాలు ఏకకాలంలో దాడులు చేశారు. జిల్లాలోని 13పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దాడులుచేసి రూ. 16.13లక్షల నగదు, 359డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకొని 14కేసులు నమోదుచేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన నిబంధనలకు లోబడి ఫైనాన్స్ నిర్వహించాలని చెప్పారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుంచి అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమకున్న అత్యవసర పరిస్థితి, తాత్కాలిక అవసరాల కోసం అధిక మొత్తంలో అవసరంకు మించి అధిక వడ్డీలకు అప్పుచేసి ఆ అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడి తమ కుటుంబాలకు ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్ధతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే విశ్వసించాలని చెప్పారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకపోయినా అక్రమ ఫైనాన్స్ వ్యాపారం నడిపే వారి వివరాలు జిల్లా పోలీసు కార్యాలయంలో తనకు సమాచారం ఇవ్వాలన్నారు. డయల్ 100కు ఫిర్యాదుచేసినా చర్యలు ఉంటాయని చెప్పారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుందన్నారు. అప్పు తీసుకోవడం , ఇవ్వడం నేరం కాదని, ఆర్‌బిఐ నిబంధనలు , మనిలెండింగ్ యాక్ట్ నిబంధనల ప్రకారం చట్టబ ద్ధంగా ఎవరైనా లైసెన్స్‌తో అప్పులు ఇవ్వొచ్చన్నారు. చట్ట విరుద్ధంగా అధిక వడ్డీ రేట్లతో సామాన్యులై దౌర్జన్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, బొప్పాపూర్, తదితర గ్రామాల్లోని వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. సుమారు పది మంది వ్యాపారుల ఇళ్లలో తనిఖీలు జరిపారు. నగదు, ప్రామిసరీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

వేములవాడ: వేములవాడ పట్టణంలోని వడ్డీ వ్యాపారులపై జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. అధిక వడ్డీకి నగదు ఇస్తూ ఇబ్బందుల గురి చేస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక డీఎస్పీ కే నాగేంద్ర చారితో కలిసి చేపట్టిన ఈ దాడులలో భాగంగా పట్టణంలో పలువురు వడ్డీ వ్యాపారులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ ప్రవీణ్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు అంజయ్య, నాయుడు, పృథ్విగౌడ్, జ్యోతి తదితరులు తనిఖీలలో పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఒకరిపై కేసు

శంకరపట్నం, ఏప్రిల్ 6: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదైనట్లు శనివారం పోలీసులు తెలిపారు. మండలంలోని గద్దపాక గ్రామానికి చెందిన చిత్తారి కిరణ్ అక్రమంగా మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి చెప్పారు. కిరణ్ వద్ద నుంచి 4.355లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినట్లు సమాచారం వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని కోరారు.

మిస్సింగ్ కేసు నమోదు

వీణవంక, ఏప్రిల్ 6: మండలంలోని బేతిగల్ గ్రామానికి చెందిన అంబాల సమ్మయ్య రెండు రోజుల క్రితం ఇంటిలో కుటుంబ సభ్యులతో గొడవ పడి వెళ్లి పోయాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతి తెలిపారు. బంధువుల ఇళ్లల్లో గ్రామంలో వెతికినా ఆచూకీ లభించక పోవడంతో భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వివాహిత అదృశ్యం

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 6: భర్తతో గొడవపడిన వివాహిత అదృశ్యమైనట్లు ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన మనిషా(25) ఈనెల 3న తన భర్తతో గొడవ పడి రాత్రి 9:30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి అదే గ్రామంలోని బంధువుల ఇంటిలో ఆశ్ర యం పొందింది. 4న మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన అత్త ఇంటికి వెళ్తున్నట్లు చెప్పిన మనీషా బయటకు వెళ్లి ఇంతవరకు ఆచూకీ లేకుండా పోయిందని ఆమె తండ్రి దాసరి నరేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మనీషాకు ఇద్దరు కొడుకులు ఉన్నారని, తండ్రి ఫిర్యాదు మేరకు అదృశ్యం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 6: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురు వాహనదారులకు జైలుశిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన తనిఖీలలో పట్టుబడిన 21 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపరచగా ఇందులో నుంచి ఒకరికి ఏడు రోజులు, ఇద్దరికి ఐదు రోజుల జైలుశిక్ష, మొత్తం 6,500 రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు. మిగతా 18 మంది వాహనదారులకు 31 వేల రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

వాగులో మునిగి కార్మికుడి మృతి

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్ 6: మండలంలోని చౌలమద్ది గ్రామంలోని బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం వచ్చి షిడం పోశం(40) అను కార్మికుడు ప్రమాదవశాత్తు వాగులో మునిగి శనివారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మంచిర్యాల జిల్లా భీమారం మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన పోశం కూలి పనులు చేసుకంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. భార్య ఎనిమిదేళ్ల క్రితం చనిపోవడంతో నలుగురు సంతానంతో కలిసి ఉంటున్నాడు. పనులు కోసం చౌలమద్ది గ్రామంలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణంలో పని కోసం తోటి కూలీలతో కలిసి వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం వాగులో తోటి కూలీలతో కలిసి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. తోటి కూలీలు చీకటి పడేంత వరకు వెతికినా ఫలితం లభించలేదు. శనివారం ఉదయం పోశం మృతదేహాన్ని గుర్తించారు. పోశం కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్6: హైదరాబాద్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థలో మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో చేరేందుకు తల్లిదండ్రులను కోల్పో యిన అనాథ బాలికలు, తల్లి లేదా తండ్రి కోల్పోయిన బాలికలు, ఇతర నిరాశ్రయులైన పిల్లలు, చిల్డ్రెన్ హోం సంస్థల్లోని బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలు, వికలాంగుల బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లలో 60 చొప్పున సీట్లు ఉన్నాయని, మొత్తం 240 సీట్లకు దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్‌లో గల బాల రక్షాభవన్ కార్యాలయంలో దరఖాస్తు ఫారాల కోసం సంప్రదించాలని సూచించారు. పూరించిన దరఖా స్తులను మే15 సాయంత్రం 5 గంటలలోపు ధ్రువపత్రాలను జతచేసి సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఫోన్ 833-298-7862 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చిన్నారిని చిదిమేసిన ఆటో

- రోడ్డు ప్రమాదంలో 18 నెలల బాలుడి మృతి



సుధన్య(ఫైల్)

కోరుట్ల, ఏప్రిల్ 6: అప్పటి వరకు కుటుంబ సభ్యుల ముందు తప్పటడుగులు వేస్తూ.. వచ్చీ రాని మాటలతో అందరినీ ఆనందంలో ముంచెత్తిన ఆ చిన్నారి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడటంతో కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది. పోలీసులు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు.. పట్టణంలోని అంబేద్కర్ నగర్ ప్రాతంలో నివాసం ఉంటున్న పొట్ట రిషింద్ర - అపూర్వ దంపతులకు కుమారుడు సుధన్య (18 నెలలు) ఉన్నాడు. శనివారం ఉదయం సుధన్య ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అదే సమయంలో ఆ ప్రాంతంలో మంచి నీళ్ల సరఫరా చేయడానికి వచ్చిన ఆటో ప్రమాదవశాత్తూ చిన్నారిని ఢీ కొట్టడంతో సుధన్య ఆటో చక్రాల కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగానే మృతి చెందాడు. చిన్నారి తండ్రి రిషింద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని ఒకరి మృతి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 6: ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని పెగడపల్లి శివారులో చోటుచేసుకుంది. శనివారం మండలంలోని పందిళ్ల గ్రామానికి చెందిన సూర తిరుపతి(45) తన భార్య స్వరూపతో కలిసి తన ద్విచక్ర వాహనంపై సుల్తానాబాద్ నుండి పందిళ్లకు వస్తుండగా మార్గమధ్యలో పెగడపల్లి శివారులో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం చెట్టుకు ఢీకొంది. దీంతో సూర తిరుపతికి తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, తిరుపతి భార్య స్వరూపకు స్వల్ప గాయాలయ్యాయి. తిరుపతికి భార్యతో పాటు కుమారుడు కూతురు ఉన్నారు. ఈ విషయంపై మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఓంకార్ యాదవ్ కేసు నమోదు చేసుకొని తిరుపతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



విద్యార్థుల పత్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్, ఏప్రిల్ 6: రెండో విడత జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ జేఈఈ మెయిన్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం మూడో రోజు జిల్లా వ్యాప్తంగా కేవలం మండల కేంద్రలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రాంలోనే రెండు షిఫ్టులలో పరీక్షలు నిర్వహిచారు. మొదటి షిఫ్టులో 680 మందికి 608 మంది, రెండో షిఫ్టులో 672 మందికి 61 4 మంది పరీక్షకు హాజరయ్యారు. అభ్యర్థులను రెండు గంటల ముందు నుంచే పరీక్ష కేంద్రం లోనికి అనుమతించారు. ఎండ తీవ్రత కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు తలెత్త కుండా తగిన ఏర్పాట్లు చేశామని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలితకుమారి తెలిపారు.

నేతన్నలు ధైర్యం వీడొద్దు

- రాజకీయపార్టీల వల్లే వస్త్ర పరిశ్రమ సంక్షోభం
- గత ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు
- కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య



హాజరైన నేతన్నలు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 6: సిరిసిల్ల మళ్లీ ఉరిశాలగా మారుపోతుందా అనే అను మానాలు వ్యక్తం అవుతున్నాయని, నేతన్నలు ధైర్యం వీడొద్దని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ వీరయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో శనివారం రాత్రి వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోబానికి మూడు రాజకీయ పార్టీలు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లేనన్నారు. కేంద్రం ప్రభుత్వం చేనేత, టెక్స్‌టైల్ శాఖలను రద్దు చేసి వస్త్ర పరిశ్రమలతోపాటు అనుబంధం రంగాల పరిశ్రమలపై 4 శాతం ఉన్న జీఎస్టీని 12 శాతానికి పెంచి భారం మోపిందని చెప్పారు. అంతే కాకుండా బహుళ జాతి కంపెనీలను ప్రోత్సహిస్తోందన్నారు. దీంతో చిన్నచిన్న పరిశ్రమల్లో సంక్షోభం రావడంతో నేతన్నలకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. సిరిసిల్లలో మూడు నెలలనుంచి వస్త్ర పరిశ్రమలు బంద్ కావడంతో నేతన్నలకు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నెల రోజుల్లో ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకారమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలతోపాటు ఇతర వస్త్రాలకు సంబంధించిన బకాయిలతోపాటు యారన్ సబ్సిడీలను చెల్లించి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కోపంతో సిరిసిల్లలో నేతన్నలకు ఉపాధిని కల్పించకుండా కక్ష్యసాధింపులకు పాల్పడుతోందన్నారు. మూడు నెలలనుంచి ఉపాధిని కల్పించేందుకు బతుకమ్మ చీరలతోపాటు ఇతర ప్రభుత్వ ఆర్డర్‌లను ఇప్పించాలంటూ నేతన్నలు పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని చెప్పారు. ఈ సమస్యకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యత వహించి ప్రభుత్వంతో పోరాటం చేసి నేతన్నలకు ఉపాధిని కల్పించాలన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు సంక్షోభంతో పాటు లక్షల్లో కరెంట్ బిల్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటని గతంలోనే పరిష్కరించాల్సి ఉండాల్సిందని చెప్పారు. ఆ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కరెంట్ బిల్లు సైతం భారంగా మారిపోయాయన్నారు. సిరిసిల్లలో మరమగ్గాల కార్మికులను ఓనర్లుగా చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన వర్కర్ టూ ఓనర్ పథకం నిర్మాణ దశలోనే నిలిచిపోయిందని తెలిపారు. దీంతో ఇప్పటికే కార్మికులు ఉపాధి లేక కాలేకపోయారని అన్నారు. మూడు నెలలనుంచి ఉపాధి కోల్పోయిన నేతన్నలు బిక్షలను చేసుకొని జీవనం చేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. నేతన్నల సమస్యలను పరిష్కరించుకునేందుకు నిత్యం పోరాటాలను కొనసాగించాలని సూచించారు. ఇప్పటికైనా సిరిసిల్లలో నేతన్నల ఆకలి చావులను చూసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి ఉపాధిని కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, కూరపాటి రమేశ్, జేఏసీ నేతలు మంచె శ్రీనివాస్, మూషం రమేష్, కోడం రమణ, సిరిసిల్ల రవీందర్, మండల రాజు, పంతం రవి, వెల్దండి దేవదాస్, కట్టికెల లక్ష్మీనారాయణ, తాటిపాముల దామోదర్, మోర రాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి దీటుగా ఫలితాలు అందిస్తున్న సంతాన సాఫల్య కేంద్రం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 6: సంతానం లేని దంపతులకు ఐవీఎఫ్ పద్ధతి ఒక వరం లాంటిదని పద్మజ సంతాన సాఫల్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ పద్మజ తెలిపారు. శనివారం ఆసుపత్రి సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాధునిక వైద్య విధానాలు, సంతాన సాఫల్యంలో అద్భుత ఫలితాలు సాధించడం కరీంనగర్‌లోని పద్మజ సంతాన సాఫల్య కేంద్రానికే దక్కుతాయన్నారు. 25 సంవత్సరాల క్రితం కరీంనగర్‌లో ప్రారంభమైన పద్మజ సంతాన సాఫల్య కేంద్రంలో అంతర్జాతీయ స్థాయికి దీటుగా ఫలితాలు ఇస్తున్న సంతాన సాఫల్య కేంద్రం తమదేనని అన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి వచ్చి సంతానం పొందిన దంపతులు వేల సంఖ్యలో ఉన్నారని తెలిపారు. ఒకే రోజులో ఒకే కాన్పులో ఇద్దరు, ముగ్గురు సంతానం కలిగిన దంపతులు ఉన్నారని తెలిపారు. వారం దరిసీ ఈరోజు ముందుకు తీసుకు వచ్చామన్నారు. పిల్లలు లేని దంపతులకు స్త్రీ, పురుషుల పునరుత్పత్తి వ్యవస్థ ద్వారా ఐవీఎఫ్ ఒక అద్భుత వరమన్నారు. ఐవీఎఫ్ విధానంలో భార్య అండాశయం నుంచి అండాలను బయటకు తీసి, భర్త వీర్యకణాలను అండంలోకి ఇంజెక్ట్ చేసి ఇంక్యుబేట్ చేస్తామని తెలిపారు. మూడు రోజుల తరువాత ఫలదీకరణ చెందిన పిండాన్ని తిరిగి గర్భాశయంలో ప్రవేశ పెడుతామని పేర్కొన్నారు. ఐవీఎఫ్ పద్ధతి కోసం వినియోగించే పరికరాలు అన్నీ విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నవేనని తెలిపారు. అయితే వాటితో వైద్యం చేయడం కూడా ఖర్చుతో కూడుకున్నదన్నారు. అంతర్జాతీయ సక్సెస్ రేటు 35 శాతం నుంచి 40 శాతం కాగా, ఇక్కడ 70 నుంచి 75 శాతం సక్సెస్ ఇస్తున్నామన్నారు. తమ సక్సెస్ రేటును చూసే దేశ విదేశాల నుంచి తమ వద్దకు సంతానం కోసం వస్తున్నారని తెలిపారు. గర్భధారణ అయినవారి కళ్లల్లో ఆనందం చూశాక తాము పడిన శ్రమ మర్చిపోయి తిరిగి మరింత ఉత్సాహంగా పనిచేయాలనిపిస్తుందన్నారు.

ఈ పద్ధతి గురించి ఎన్నో అపోహలు, ఆటంకాలను దాటుకొని ఫర్టిలిటీలోని ఆధునిక పద్ధతులను అనుసరిస్తూ మాతృత్వాన్ని ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం ఎన్నో ఐవీఎఫ్ సెంటర్లు ఉన్నప్పటికీ వస్తున్న ఫలితాలే తమ అభివృద్ధికి సోపానాలని పేర్కొన్నారు.


పద్మజ సంతాన సాఫల్య కేంద్రంలో ఒకే రోజు ఐవీఎఫ్ పద్ధతి ద్వారా మాతృత్వం పొందిన మహిళలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఆర్డీవో


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో హనుమా నాయక్

కమాన్‌పూర్, ఏప్రిల్ 6 : మండలంలోని ముల్కలపల్లి, కమాన్‌పూర్,జూలపల్లి, గొల్లపల్లి, గుండారం, పేరపల్లిలలో సెర్ప్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం మంథని ఆర్డీవో హనుమనాయక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలలోనే రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అరిపోద్దీన్, ఆర్ఐ సముదాన్, ఏపీఎం శైలజాశాంతి, పీఏసీఎస్ సెక్రెటరీ తిమ్మరాజు, సంతోష్‌కుమార్‌లతోపాటు రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

జూలపల్లి, ఏప్రిల్ 6 : ప్రభుత్వం ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామసమాఖ్య జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రవి అన్నారు. మండలంలోని కాచాపూర్, పెద్దాపూర్ గ్రామాల్లో శనివారం ఐకేపి ద్వారా ఏర్పాటుచేసిన వరిదాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఏపీఎం సుదాకర్, సీసీ మల్లేశం, పలువురు రైతులు మహిళా సంఘాల ప్రదినిదులు పాల్గొన్నారు.

ధర్మారం, ఏప్రిల్ 6 : మండలంలోని రచ్చపల్లి గ్రామంలో శనివారం సెర్ప్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో బీవోలు, మహిళా సంఘాల ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

మండల విద్యాధికారికి ట్రస్మా సన్మానం


సన్మానిస్తున్న ట్రస్మా నాయకులు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 6: రామగుండం ఎంఈవోగా పదవీ విరమణ పొందిన పి.సంపత్‌రావుకు, నూతన బాధ్యతలు స్వీకరించిన ఆరెపల్లి రాజయ్యలను రామగుండం ట్రస్మా సత్కరించింది. శనివారం గోదావరిఖని మార్కండేయకాలనీలోని ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో రామగుండం ట్రస్మా ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన పి.సంపత్‌రావు సత్కరించి వీడ్కోలు తెలుపుతూ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజయ్యను సన్మానించారు. పీఎస్ అమరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా, రాష్ట్ర నాయకులు కేశవరెడ్డి, విజయానంద్, కరస్పాండెంట్‌లు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, ఓదెలు, బుచ్చిరెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 6: పెద్దపల్లి పట్టణం పోచమ్మ వీధికి చెందిన అబ్దుల్ షకీల్ భార్య సంజీత బేగం విద్యుత్ షాక్ గురికావడం వల్ల రక్తం సరఫరా లేక అచేతన స్థితిలో ఉండడంతో విజ్ఞన్న యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం వినోద్ రెడ్డి చేయూత అందించారు. ఆమే వైద్య ఖర్చుల కోసం నగదు, 50 కిలోల బియ్యం ఆమె కుటుంబ సభ్యులకు శనివారం వినోద్‌రెడ్డి అందజేశారు. బాధితురాలి కుటుంబ సభ్యులు సహాయమందించిన వినోద్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెహరాజ్, బొడ్డుపల్లి శ్రీనివాస్, హైమద్, తదితరులు పాల్గొన్నారు

రణదీవేకు ఘన నివాళి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 6: సీఐటీయూ అఖిల భారత తొలి అధ్యక్షులు బి టి రణదీవే వర్ధంతిని శనివారం పెద్దపల్లి యూనియన్ జిల్లా కార్యాలయం లో జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిటి రణదీవే గారి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి జి.జ్యోతి మాట్లాడుతూ భారత కార్మిక ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన బీటీ రణదీవే జీవితాంతం కార్మిక హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్.వెంకటస్వామి, ఎస్.సతీష్ మరియా, స్వప్న, అన్వేష్, అంజయ్య సాగర్ కార్మికులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సంధ్యారాణి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని జిల్లా మహిళ సాధికారత ఫైనాన్షియల్ లిట్రసి ఎస్.సంధ్యారాణి అన్నారు. శనివారం మండలంలోని హన్మంతునిపేటలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఆర్థిక ద్రవ్యోల్బణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ బాలికలను చదివించాలన్నారు. సఖీ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారం, చైల్డ్ హెల్ప్ లైన్ తదితర వాటిపై వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ శ్రవణ్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, రములతో పాటు పలువురు పాల్గొన్నారు.

'నారాయణ కుటుంబానికి న్యాయం చేయాలి'

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 6: పోలీసు కాల్పులకు బలైన సింగరేణి కార్మికుడు పుట్ట నారాయణ కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. పుట్ట నారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గోదావరిఖని మార్కండేయకాలనీలోని స్నేహసాహితీ గ్రంథాలయంలో పుట్టనారాయణ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, కవి రచయిత ఏలేశ్వరం వెంకటేశ్వర్లు పుట్ట నారాయణ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా పౌరహక్కుల సంఘం నాయకులు శ్రీపతి రాజగోపాల్, అధ్యక్షుడు సుచరిత, నక్క సత్యనారాయణ, పుట్ట నారాయణ సోదరుడు పుట్ట రాజన్న, సింగరేణి ఉద్యోగుల సంఘం శేఖర్, ఎరుకల పోచయ్య, వెంకటేష్, రమేష్, నర్సింగరావు పాల్గొన్నారు.

'అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు'

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 6: ప్రభుత్వ అనుమతి లేకుండా మానేరు, హుస్సేన్ మియావాగులో నుంచి ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జాహేద్ పాషా అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల ఓనర్లు, గ్రామ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. గృహాలకు ఇసుక అవసరముంటే ఆయా గ్రామ కార్యదర్శుల ద్వారా అనుమతులు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ పనులైన సీసీ రోడ్లు, ప్రభుత్వ భవనాలకు ఇసుక అవసరముంటే కలెక్టర్ ద్వారా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన మిర్జంపేట, కిష్టంపేట ఇసుక రీచ్‌ల నుంచే ఇసుక తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామ్మోహనచారి, ఏఎస్ఐ నీలిమ పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 6: సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రినగర్‌లో శనివారం పోచమ్మ తల్లికి బోనాల ఉత్సవాలు నిర్వహించారు. గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించబడిన బొడ్రాయి విగ్రహాల ప్రతిష్ఠ ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రి గ్రామ బలి దిగ్బంధం చేశారు. ఈ కార్యక్రమంలో పూసాల మాజీ సర్పంచ్ సాయిరి పద్మ, సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరి మహేందర్, కౌన్సిలర్ రేవెల్లి తిరుపతి, గోపాల్,బండ తిరుపతి, లక్ష్మయ్య, మేరుగు వెంకటేశ్, పూల రాజు, సంతోష్ రేవెల్లి తిరుపతి, వెంగల బిక్షపతి, బుర్ర సతీష్ తదితరులు పాల్గొన్నారు.

లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 6 : మండలంలోని రాఘవపూర్ రైల్వే స్టేషన్‌కు గోదా వరిఖని మైనింగ్ ప్రాంతం నుంచి లారీల ద్వారా బొగ్గును తరలిస్తుండటంతో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని శనివారం అందుగులపల్లి గ్రామస్థులు లారీలను అడ్డుకొని ఆందోళన చేపట్టారు. ఈ దారిపై వందల లారీలు బొగ్గు లోడ్‌తో వెళ్తుండ టంతో రోడ్డు అంతా గుంతల మయంగా మారిందని సంబంధిత కాంట్రాక్టర్‌కు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రోడ్డుకు మరమ్మతు చేయాలని, లేకుంటే లారీల రాకపోకలు నిలిపివేయాలన్నారు. ఆందోళనలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆదివరాహస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం

కమాన్‌పూర్, ఏప్రిల్ 6 : మండల కేంద్రంలోని ఆదివరాహస్వామి దేవాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకొని పంచాగ శ్రవణ కార్యక్రమం జరగనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కొనన కాంతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి అభిషేకాలు, ఉదయం 7 గంటలకు వాహనాల పూజా కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 6: పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి పోటీచేస్తున్న గడ్డం వంశీకి తమ మద్దతుఉంటుందని ఎంఆర్‌పీఎస్, టీఎంఆర్‌పీఎస్, టీఎంహెచ్‌డీ, ఆర్‌డీఎస్, మహాఆది జాంబవ నాయకులు శివ, రాజు, కొమ్ముల సంపత్, కనకరాజు, ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణాల్లో దళిత బస్తీలు ఏర్పడ్డాయంటే మాజీ కేంద్ర మంత్రి వెంకట స్వామి వల్లనేనని, కాంగ్రెస్ అభ్యర్థి వంశీని గెలిపించేందుకు కులసంఘాలన్నీ ఐక్యంకావాలని పిలుపునిచ్చారు.

కస్తూర్బాలో మాక్ పోలింగ్

ఓదెల, ఏప్రిల్ 6: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ హై స్కూల్లో శనివారం ఎలక్షన్ లిటరసీ క్లబ్‌లో భాగంగా మాక్ పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియను తెలుపుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో ఏడుగురు విద్యార్థులు పోటీ చేయగా, గెలిచిన అభ్యర్థిని ప్రకటించితీరు, ఎన్నికల అధికారిగా విధుల నిర్వహణ తదితర వివరాలను విద్యార్థులకు తెలిపారు.

రైతులకు శిక్షణ

ఓదెల, ఏప్రిల్ 6 : మండలంలోని మడకలో శుక్రవారం పురుగుల మందును పిచికారి, తగు జాగ్రత్తలపై కేశవపూర్ ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ నిర్వహించారు. బీసీఐ ఫీల్డ్‌ఫెసిలిటీ అరుణ, రైతులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 6 : పద్దెనిమిదేళ్లు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పెద్దపల్లి జడ్పీటీసీ రామ్మూర్తి పేర్కొన్నారు. శనివారం మండలంలోని చీకురాయి గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రామ్మూర్తి హాజరై మాట్లాడారు. ఎంపీవో సుదర్శన్, పంచాయతీ కార్యదర్శి రాధతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

తుక్కుగూడకు తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

ముత్తారం ఏప్రిల్ 6: తుక్కుగూడలో సభకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు భారీగా తరలి వెళ్లారు.

కమాన్‌పూర్ : తుక్కుగూడెలో నిరహించతలపెట్టిన జన జాతర సభకు మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలి వెళ్లారు. తరలివెళ్లిన వారిలో మండలాధ్యక్షుడు వైనాల రాజు తదితరులు ఉన్నారు.

పాఠశాలలో స్నాతకోత్సవం

కోల్‌సిటీ, ఏప్రిల్ 6: గోదావరిఖని రమేష్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయంలో శనివారం స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ హోమియో వైద్యులు వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులు బండారు రాయమల్లు, పాఠశాల డైరెక్టర్ విక్రం వర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం


కార్యక్రమంలో మాట్లాడుతున్న గుజ్జుల రామక్రిష్ణారెడ్డి


బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న కందుల సంధ్యారాణి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 6: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, జాతీయ కౌన్సిల్ సభ్యుడు గుజ్జుల రామక్రిష్ణారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా 400 స్థానాలను సాధిస్తుందని స్పష్టం చేశారు. పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను గెలిపించడం కోసం ప్రతీ కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చాడు. ఈ కార్యక్రమంలో మీస అర్జున్ రావు, ఠాగూర్ రాంసింగ్, ఆది కేశవరావు, పిన్నింటి రాజు, కొంతం శ్రీనివాసరెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాసరావు, పర్స సమ్మయ్య, పల్లె సదానందం, జంగ చక్రధర్‌రెడ్డి, అక్కేపల్లి క్రాంతి, పెండ్యాల రమేష్, పెండ్యాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని : బీజేపీ ఆవిర్భావ దినోత్సవం శనివారం గోదావరిఖనిలో ఘనంగా జరిగింది. పార్టీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి చౌరస్తాలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం బూత్ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కలిసి టిఫిన్ బైటక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెరుగు హన్మంత్ గౌడ్, బల్మూరి వనిత, గాండ్ల ధర్మపురి, సుల్వ లక్ష్మీనర్సయ్య, పెద్దపల్లి రవీందర్, కోమల మహేష్, క్యాతం వెంకటరమణ, మహావాది రామన్న, కొండపర్తి సంజీవ్, కోమళ్ల పురుషోత్తం, మంతెన రాజయ్య, బూర్ల లక్ష్మీనారాయణ, గోపాల్ రావు, ముప్పిడి సుధాకర్, గోపాగోని నవీన్, మచ్చ విశ్వాస్, తోట కుమారస్వామి, మిట్టపల్లి సతీష్, పైతరీ రాజు, మీసం హరీష్, బరుపటి నారాయణ, పద్మ, అపర్ణ, మహేందర్, ఆకాష్, రంజిత్, హర్ష పాల్గొన్నారు. అలాగే స్థానిక శివాజీ నగర్ పోలింగ్ బూత్ సెంటర్‌లో బీజేపీ నాయకురాలు సోమవారపు లావణ్యఅరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆవిర్భావ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కోదాటి ప్రవీణ్, సునీల్, సతీష్, శ్రావణ్, రాజేందర్, శిరీష, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాగా, గోదావరిఖని బీజేపీ జనగామ మండలం 9వ డివిజన్, 29వ డివిజన్ జీఎం కాలనీలోని 79, 80, 83, 84 పోలింగ్ బూత్‌లలో టిఫిన్ బైటాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్, బీజేపీ జనగామ జోన్ మండల అధ్యక్షుడు మామిడి సంపత్, విఠల్‌నగర్ జోన్ మండల అధ్యక్షుడు అడ్డూరి రాజేష్, రామగుండం జోన్ మండల అధ్యక్షుడు మంద శ్రీనివాస్, నాయకులు తాటిపర్తి శ్రీధర్‌రావు, గుండబోయిన భూమయ్య, పంగ రవి, కుమ్మరి మల్లేష్, రాదండి శ్రీనాథ్, కొమురవేల్లి విశ్వనాథ్, వడ్డేపల్లి సదానందం పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : బీజేపీ ఆవిర్భావ దినోత్సవం మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని నిమ్మనపల్లిలో పార్టీ జండాను బూత్ అధ్యక్షుడు లక్ష్మణ్ ఎగురవేశారు. అనంతరం మండల పార్టీ ఆధ్వర్యంలో టిఫిన్ బైటక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిలారపు పర్వతాలు, మండల జనరల్ సెక్రెటరీ వేల్పుల రమేష్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు శ్రీధర్, ఉమేష్, రాజేందర్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


టిఫిన్ బైటక్‌లో పాల్గొన్న ఎస్ కుమార్, బీజేపీ నాయకులు

ఇసుక తవ్వకాలు నిలిపివేయాలని నిరాహార దీక్ష

సుల్తానాబాద్, ఏప్రిల్ 6: మండలంలోని గట్టెపల్లి మానేరు వాగు నుంచి ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ గ్రామానికి చెందిన నాయకులు శనివారం వాగు వద్ద నిరాహారదీక్షలు ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దామోదర్ రావు, ఎంపీటీసీ శీలం శంకర్, కోడి కనుకయ్య, రాజమౌళి, గుర్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


నిరాహార దీక్ష చేస్తున్న నాయకులు

మహాసభను విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 6: గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించనున్న సింగరేణి, కార్మికుల హక్కుల పరిరక్షణ మహాసభను విజయవంతం చేయాలని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మిట్టపల్లి కుమారస్వా మి పిలుపునిచ్చారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభ నిర్వహించనున్నట్టు, మహాసభకు ఉద్యోగులు హాజరుకావాలని, ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కోదండరాం తదితరులు హాజరవుతారని చెప్పారు. కనకయ్య, బేగ్, శేఖర్, సత్యం, వీరయ్య, రాయపోషం, శంకర్ పాల్గొన్నారు.



నేత్రదానంపై అవగాహన

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 6: అంధత్వ నివారణ వారోత్సవాల్లో భాగంగా శనివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంవీటీసీలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం జరిగింది. సింగరేణిలో కొత్తగా ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగస్థులకు అంధత్వ నివారణపై సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అవగాహన కల్పించారు. మరణానంతరం వృధాగా మట్టిలో కలిసి పోయే నేత్రాలు వేరొకరికి దానం చేయడం వలన వారి కుటుంబాల్లో వెలుగులను నింపవచ్చని పేర్కొన్నారు. అవయవ దానంపై అనేక అపోహలు ఉన్నాయని, వాటిని పారద్రోలేలా యువత అవయవ దానంపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉన్నట్టు లింగమూర్తి పేర్కొన్నారు. ఈసందర్భంగా మరణానంతరం నేత్ర దానానికి అంగీకరించిన 30 మంది యువ ఉద్యోగులకు సదాశయ ఫౌండేషన్ డోనర్ కార్డులను లింగమూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీటీసీ మేనేజర్ రంగారెడ్డి, ఎస్ఎంఎస్ ప్లాంట్ పీవో నూక రమేష్, ఏటీవో మురళీకృష్ణ, సూపర్ వైజర్లు మహేష్, సతీష్, తిరుపతి పాల్గొన్నారు.

రిటైర్ ఉద్యోగికి సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 6: పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో సింగరేణి రిటైర్ ఉద్యోగి పసునూటి సాంబశివరావుని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సన్మానం చేశారు. ఓసీపీ-1 బేస్ వర్క్‌షాప్‌లో ఈపీ టర్నర్‌గా పనిచేస్తూ మార్చితో ఉద్యోగ విరమణ చేసిన సాంబశివరావుని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు దేవనపల్లి చక్రాపాణి ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో సెక్షన్ ఇంచార్జి ఐ శ్రీనివాస్, జేఈ రఘుకుమార్, ఆర్జీ-3 ఏరియా ఐఎన్‌టీయూసీ నాయకుడు జక్కుల దామోదర్‌రావు, పద్మశాలి సేవా సంఘం నాయకులు గుండేటి రాజేష్, రాజేష్, కుర్మ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రాయమల్లు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి క్యాష్ రివార్డు

కోల్‌సిటీ, ఏప్రిల్ 6: విధి నిర్వహణలో అత్యంత ప్రతిభ కనబరిచిన సిబ్బందికి గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి శనివారం క్యాష్ రివార్డు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందు వల్ల ఎటువంటి అసాంఘిక కార్యక లాపాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని కోరారు. మార్చి నెలలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి క్యాష్ రివార్డు ఇచ్చారు. ప్రతి నెల విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వారిని తగు రీతిలో సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్-2 రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 6: ఆరోగ్య పరిరక్షణ కోసం యోగా ఎంతో ఉపయోగపడుతుందని ఆధ్యాత్మిక, సామాజిక సేవ వ్యవస్థాపక అధ్యక్షులు గొట్టెముక్కుల నారాయణచారి అన్నారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకు సమాజంలో పెరుగుతున్న అశాంతి,దుఃఖం దూరం చేయడానికి, రోగాలను నయం చేయడానికి యోగా ఉపయోగపడుతుందని, మానవుని జీవిత శైలిని మార్చుకునేందుకు ధాన్యం అనే శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. నెలరోజుల పాటు జరిగే యోగా శిక్షణ తరగతులను ఉపయోగించుకోవాలని, యోగాతో తమ పిల్లలను కూడా చిన్ననాటి నుంచే యోగాను నేర్పించాలని, యోగాతో కుటుంబ ప్రశాంతమైన జీవనం దొరుకుతుందన్నారు. యోగాతో కుటుంబం సుఖ శాంతులతో జీవించవచ్చునని, తప్పకుండా శిక్షణను ఉపయోగించుకోవాలని కోరారు. మార్కండేయకాలనీలోని శివాలయంలో రోజు ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు యోగా తరగతుల్లో పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి - ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

కోల్‌సిటీ, ఏప్రిల్ 6: రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు సూచించారు. హర్ష ఫౌండేషన్ అధ్యక్షుడు బూడిద హర్ష ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ టీ జంక్షన్ వద్ద నిర్వహించిన ట్రాఫిక్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంలోనే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు దేశంలో జరుగుతున్నాయని, అందులో ఎక్కువ మంది యువతనే ఉన్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపరాదని, ఓవర్‌టేకింగ్ చేయరాదని, దేశంలో రోడ్డు ప్రమాదాలు నివారించడమే కాకుండా యువత భవిష్యత్ తరాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రవి ప్రసాద్, వైద్యురాలు లక్ష్మీవాణి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్, వరుణ్, మణికంఠ, విష్ణు ప్రియ తదితరులు పాల్గొన్నారు.